




రోడ్డుపై ధాన్యం రాశులు

మంత్రి లేఖ బట్టబయలు





- మిర్చి యార్డు కార్యదర్శి తీరు వివాదాస్పదం
- రహస్యంగా ఉంచాల్సిన లేఖతో హైకోర్టులో పిటిషన్
- ఆంజనేయులపై ప్రభుత్వ ఉన్నతాధికారులు సీరియస్
- విచారణకు మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత ఆదేశాలు

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓ అంశానికి సంబంధించి మంత్రి.. అధికారులకు రాయగా దానిని రహస్యంగా ఉంచాల్సిన అధికారులే బహిర్గతం చేశారు. ఈ విషయం ప్రస్తుతం గుంటూరు మిర్చియార్డు వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వివాదంలో గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు చిక్కుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో అత్యంత గోప్యత కలిగిన ఫైల్‌లోని లేఖను సంపాదించడం, దాన్ని బహిర్గతం చేయడంపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆయనపై సీరియస్‌గా ఉన్నారు.

ఆ లేఖ ఎలా వచ్చింది...

వ్యవసాయ శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖ బయటకు ఎలా వచ్చిం దన్న దానిపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. పేషీలో ఉన్న ఫైల్ లోని లేఖ బయటకు రావడంపై అధికారులు ఖంగుతున్నారు. ఎవరు ఎవరికి ఈ లేఖను ఇచ్చారన్న దానిపై విచారణ జరిపించి చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు. సదరు లేఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి కార్యాలయం నుంచే బయటకు వచ్చిందని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి-1964 ప్రకారం ప్రతి ఉద్యోగి అధికారిక విషయాలను బహిర్గతం చేయకూడదు. మంత్రులు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శి అనుమతి లేకుండా వారికి సంబంధించిన విషయాలను, ఉత్త ర్వుల ను, లేఖలను వెల్లడిచేయడం తీవ్రంగా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల్లో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి వ్యవహారంలో ఏ పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.

దీనిపై రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత కూడా మంగళవారం స్పందించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి పంపిన లేఖ ఏ విధంగా బయటకు వచ్చిందనే దానిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కొద్దిరోజులుగా గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారంలో తీవ్ర సందిగ్ధం నెలకొంది. రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరిగా ఉన్న ఆంజనేయులు 2023 డిసెంబరులో అంతకంటే తక్కువ స్థాయి కలిగిన నరసరావుపేట యార్డుకు డిప్యూటేషన్ వేయించుకున్నారు. అక్కడ పనిచేస్తూనే 2024 అక్టోబరు 27న గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు. అయితే పూర్తి స్థాయిలో ఖాళీగా ఉన్న అదే పోస్టు కోసం తాజాగా గ్రూపు-1 అధికారి చంద్రిక ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. చంద్రికను గుంటూరు యార్డు కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రామారావు వ్యవసాయ శాఖ మంత్రికి సిఫార్సు చేశారు. ఆ సిఫార్సులను ఆధారం చేసుకుని విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని 2024 డిసెంబరు 2న వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరికి మంత్రి ప్రత్యేకంగా లేఖ రాశారు. అయితే తాను ఇన్‌చార్జిగా ఉన్న పోస్టులోకి చంద్రిక వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న సంగతి తెలుసుకున్న ఆంజనేయులు పావులు కదపడం ప్రారంభించారు.

హైకోర్టులో రిట్ పిటిషన్..

గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆంజనేయులు అనూహ్యంగా ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరికి రాసిన లేఖను పొందుపరిచారు. మంత్రి, కీలక అధికారి మధ్య గోప్యంగా ఉన్న లేఖను ప్రభుత్వ ఉద్యోగి బయటకు తీసుకురావడం వివాదాస్పదమైంది. మొదట్లో కేసు ఫైల్ చేసిన సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే అందులో రహస్యంగా ఉంచాల్సిన లేఖ జత పర్చినట్లు తేలడంతో సీరియస్ అవుతున్నారు. ఆంజనేయులు కోర్టులో ఫైల్ చేసిన రిట్ ప్రతిని తెప్పించుకుని అందులో పొందుపరిచిన లేఖను పరిశీలిస్తున్నారు.

నాడు ఆపసోపాలు.. నేడు అభ్యర్థనలు

వైసీపీ హయాంలో ధాన్యం సేకరణ ఒక ప్రహసనంగా జరిగింది. అరకొరగానే లక్ష్యం నిర్దేశించగా దానిని పూర్తి చేసేందుకు రైతు లు ఆపసోపాలు పడేవారు. నగదు ఎప్పటికి వస్తుందో తెలియక.. రైతులు బహిరంగ మార్కెట్లో నష్టానికి విక్రయించుకున్నారు. అదే ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించి ధాన్యం సేకరణ లక్ష్యం రోజుల వ్యవధిలోనే ముగిసింది. నగదు వెంటనే జమవుతుండటం.. నిబంధనల సడలింపులతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి అనుమతులపై సానుకూల స్పందన రావాల్సి ఉంది.

- నిర్దేశించిన లక్ష్యం మేర ఇప్పటికే సేకరణ పూర్తి
- అదనంగా సేకరణకు ప్రతిపాదనల ఆమోదంలో జాప్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అవస్థలు
- అయినకాడికి దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు
- మిల్లుల్లో నిల్వ చేసుకున్న ధాన్యం విషయంలోనూ తకరారు

అనుమతిస్తే.. అమ్ముకుంటాం

పొలాల్లో ఇంకా లక్షల టన్నుల ధాన్యం

లక్ష్యం మేరకు ధాన్యాన్ని అధికారులు సేకరించారు. ఇప్పటికే ధాన్యం సేకరణ లక్ష్యం ముగిసి ఐదు రోజులు అవు తుంది. అయినా ఇంకా లక్షల టన్నుల ధాన్యం పొలాల్లో ఉంది. ఇప్పటికే కోత లు కోసిన ధాన్యం మరికొంత రైతుల వద్ద ఉంది. ఈ పరిస్థితుల్లో సేకరణకు మరి కొంత అను మతిస్తే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల స్థాయిలో అదనపు అనుమతి కోసం అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతిలపై జాప్యం జరుగుతుండటంతో రైతులు ధాన్యాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు విక్రయించుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధర ను ఇష్టం వచ్చినట్లుగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్ట పోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో నష్టానికి ధాన్యాన్ని విక్రయించి అప్పుల నుంచి బయట పడుతున్నారు. ప్రభుత్వం ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేస్తుండడం.. తేమ శాతంలో కొంత సడలింపు.. తదితరాలతో కొనుగోలు కేంద్రాలకు ఈ సారి భారీగా ధాన్యం రావడం.. అతికొద్ది రోజుల్లో నిర్దేశించిన మేర లక్ష్యం పూర్తి అయింది. ఇంకా దాదాపు నాలుగో వంతు దిగుబడి రావాల్సి ఉంది. ఈ పరిస్థితు ల్లో సత్వరం ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లాలో 50,000 టన్నులు.. గుంటూరు జిల్లాలో 27 వేల టన్నులు.. పల్నాడు జిల్లాలో 5 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఆయా జిల్లాలో ఆ మేరకు ధాన్యం సేకరణ పూర్తి చేశారు. అయినా ఇంకా కల్లాల్లో, పొలాల్లోనే పనల రూపంలో, ఇప్పటికే కోతలు పూర్తి చేసి రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం లక్షల టన్ను ల్లో ఉంది. అయితే నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయిందని ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించడంలేదు. ఈ పరిస్థితుల్లో మద్దతు ధర విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో దళారులకు అయినకాడికి అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో బాపట్ల జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం పూర్తయి ఇప్పటికే 5 రోజులు గడిచింది. మరో 25,000 టన్నుల ధాన్యాన్ని కొనేలా అనుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి రెండు వారాల క్రితమే పంపారు. గుంటూరు జిల్లాలో తొలుత పదివేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించగా తర్వాత రెండు విడతలుగా మరో 17,000 టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మరో 8,000 టన్నులకైనా అనుమతి ఇవ్వాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. పల్నాడు జిల్లాలో అదనంగా మరో 30,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు కోరారు. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ధాన్యం అదనపు సేకరణకు ఆమోదించినా.. ఎంత పరిమాణం, ఎప్పుడన్న దానిపై స్పష్టత కొరవడింది. మరోవైపు ఇదే అదనుగా దళారులు రంగ ప్రవేశం చేసి బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరను మరింతగా పతనం చేసి లబ్ధి పొందే దిశగా సిండికేట్ అవుతున్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన రైతులకు లక్ష్యం పూర్తి కావడంతో అక్కడ నిరాశే ఎదురవుతోంది. పంట రైతుల చేతి కొచ్చేసరికి మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో మరి కొంత ధాన్యం నిల్వ ఉంది.

గడచిన రెండేళ్లను బేరీజు వేసుకుని..

ధాన్యం సేకరణ విషయంలో లక్ష్యాలను నిర్దేశించేటప్పుడు గడచిన రెండేళ్ల ఆధారంగా నిర్దేశించారని సమాచారం. అయితే గడచిన రెండేళ్లలో ఏ ఒక్క ఏడాది కూడా లక్ష్యాలకు మించి ధాన్యం సేకరణ ఏ జిల్లాలోనూ జరగలేదు. నిబంధనల విషయంలో

(మిగతా 8వ పేజీలో..)



బాపట్ల ప్రాంతంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న అన్నదాతలు (పాత చిత్రం)

హిమాలయ అగ్రీటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట

- గుంటూరు రూరల్ మండలంలో విస్తృతంగా తనిఖీలు
- అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనవద్దని రైతులకు సూచన

6



మొబైల్ బానిసత్వం!

- ప్రతి ఒక్కరినీ ముంచేస్తున్న స్మార్ట్ ఫోన్లు
- తగ్గించుకోకుంటే ప్రమాదమే అంటున్న నిపుణులు

8

నూతన మైదానంలో.. గణతంత్ర వేడుకలు

శరవేగంగా పనులు



మైదానం చదును చేసే పనులు

నరసరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ సమీపంలో నిర్మిస్తున్న పోలీసు కవాతు మైదానంలోనే జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కొత్త జిల్లా ఏర్పాటుతో ఏటా డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం నిర్వహించేవారు. కొత్త మైదానంలో వేడుకలు నిర్వహించనుండటంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 25 కల్లా ఏర్పాట్లు పూర్తి కానున్నాయి. ఐదు ఎకరాల స్థలంలో కవాతు మైదానం రూపుదిద్దుకుంటోంది. ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్వయంగా పనులు పర్యవేక్షిస్తున్నారు. మైదానానికి కలెక్టరేట్ నుంచి గ్రావెల్‌తో రహదారిని నిర్మిస్తున్నారు. ఈ పనులు కూడా చకచకా జరు గుతున్నాయి. ఎస్పీ శ్రీనివాసరావు కృషితో కొత్త జిల్లాకు పోలీసు కవాతు మైదానం సమకూరుతోంది.



గ్రావెల్‌తో రహదారి నిర్మాణం

కుడికాలువ నిర్వహణ.. ఏపీకి అప్పగించాలి

- 60 శాతం నీటి కేటాయింపును కొనసాగించాలి
- కేఆర్ఎంబీ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలి
- సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ డిమాండ్
- కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్‌కు వినతి పత్రం

నరసరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జవహర్ కుడి కాలువ నిర్వహణ బాధ్యతలను ఏపీ ప్రభుత్వానికి అప్పగించాలని ప్రాజెక్టు కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్‌ను కలసి వినతి పత్రం అందజేసినట్టు కమిటీ మంగళవారం తెలిపింది. కుడి కాలువకు నీటి విడుదల, గేట్ల నిర్వహణ తెలంగాణ చేతిలో ఉండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కుడి కాలువకు నీటి విడుదల చేసేందుకు వినియోగించే గేట్లు నిర్వహణలో లోపాలు ఉన్నాయని పేర్కొంది. కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ ఏపీ భూ భా గంలో ఉందని దీనిని నిర్వహ ణను తమకే అప్పగించాలి. సీఆర్‌పీఎఫ్ బలగాలను, తెలంగాణ యంత్రాంగాన్ని కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ నుంచి ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. కృష్ణానది ఏపీలో ఉన్నందున కేఆర్ఎంబీ కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలని కోరింది. రాష్ట్ర విభజన చట్టంలో సూచించిన విధంగా కృష్ణా జలాల్లో 60 శాతం వాటాను ఏపీకి, 40 శాతం వాటాను తెంగాణకు ఇదే విధానాన్ని కొనసాగించాలి. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు ఉత్పత్తి కోసం అధికంగా నీటిని వినియోగిస్తుండటంతో ఆయకట్టుకు సాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యుత్తుకు నీటి వినియోగాన్ని నియంత్రించాలి. కుడి కాలువకు నీటి విడుదల చేసే అధికారం తెలంగాణకు ఉండటంతో నీటి సరఫరాలో తప్పుడు లెక్కలు చూపుతూ కుడికాలువ ఆయకట్టుకు అన్యాయం చేస్తోంది. విద్యుత్ ఉత్పత్తికి అవసరానికి మించి నీటిని తెలంగాణ వృధా చేస్తోంది దీని వలన కుడికాలువ ఆయకట్టుకు నష్ట చేకూరుతోందని వివరించారు. తక్షణమే తమ డిమాండ్‌లను అమలు చేయాలని, కుడి కాలువకు సాగు, తాగుకు నీటి సరఫరాను కొనసాగించాలని కేఆర్ఎంబీ చైర్మన్ జైన్‌ను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి కోరారు.



చైర్మన్ అతుల్ జైన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి

దాడి ఘటనపై ఎస్పీతో చర్చించాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది బేతాళ ప్రకాష్‌పై జరిగిన దాడి విషయం పై ఎస్పీ సతీష్ కుమార్‌తో చర్చించినట్లు ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీపై ఎస్పీతో చర్చించినట్లు చెప్పారు. ఇరుపక్షాలపై నమోదైన కేసుల విషయమై డీఎస్పీ స్థాయి అధికారులతో విచారణకు ఆదేశించినట్లు, న్యాయవాది ప్రకాష్‌పై జరిగిన దాడి కేసులో తుళ్లూరు డీఎస్పీని ప్రత్యేక విచారణ అధికారిగా నియమించినట్లు ఎస్పీ తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన ఎస్ఐ రాజకుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారని విచారణ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. కాగా, గత కొన్నిరోజులుగా న్యాయవాదులు గుంటూరు ఫెడరేషన్, పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు ఈ దాడి గురించి ఆయనకు వివరించారు. సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీతో ఈ విషయమైన ఎమ్మెల్యే చర్చించారు.

జిందాల్ పవర్ ప్లాంటును సందర్శించిన మంత్రి గొట్టిపాటి



పవర్‌ప్లాంటు వివరాలను తెలుసుకుంటున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

యడ్లపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంటును విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం సందర్శించారు. వ్యర్థాల ద్వారా విద్యుత్‌ను ఎలా ఉత్పత్తి చేస్తున్నదీ, యంత్రాలు, ఉత్పత్తి తదితర వివరాలను జిందాల్ ప్రాజెక్టు ఎండీ ఎంవీ చారి మంత్రికి వివరించారు. వ్యర్థాలను గుంటూరు, విజయవాడ కార్పోరేషన్‌లతోపాటు, నరసరావుపేట, తెనాలి, చిలకలూరిపేట, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాలిటీల నుంచి రోజుకు 1,200 టన్నుల వ్యర్థాలను సేకరించి విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 23 నుంచి గంటకు 20 మెగావాట్ల ఉత్పత్తికి పెంచేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అనం తరం మంత్రి మిల్లు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ గుంటూరు ఈఈ శ్రీనివాసబాబు, ఏడీఈ రాజమోహనరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం నాటికి 559.00 అడుగులు ఉంది. ఇది 230.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,837 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,370 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 27,861 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

యార్డులో రైతులు భోజనానికి ఇబ్బంది పడొద్దు

● విస్తృత తనిఖీలు నిర్వహించిన జేసీ ఆదేశాలు
● భోజనశాలల పరిశీలన
● రైతులతో మాట్లాడి సమస్యలపై అధ్యయనం



మిర్చియార్డులో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌ఛార్జ్ అమిలినేని భార్గవ తేజ ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఆయన యార్డు ప్రాంగణానికి చేరుకున్న ఆయన, సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు, ఇతర అధికారులతో కలిసి తొలుత భోజనశాలలను పరిశీలించారు. ఈ నెల 23 నుంచి రైతులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కానుండటంతో తొలుత వాటిలో కల్పించిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. భోజనానికి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం తాగునీటి కుళాయిల్లో నీటి నాణ్యతను పరిశీలించారు. రైతులతో సంభాషించారు. యార్డులో సమ స్యల గురించి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేశారు.

జీరో వ్యాపారం కాదన్న సెక్రటరీ

ఒక లారీలో మిర్చి టిక్కీల లోడింగ్‌కు సంబంధించిన పేపర్లను ఆయన పరిశీలించారు. వాటిల్లో వేమెన్ పత్రం లేకపోవడంపై జేసీ సీరియస్ అయ్యారు. సంబంధిత పర్యవేక్షణ సిబ్బంది ఎవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని సెక్రెటరీని ఆదేశించారు. ఈ సందర్భంగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఎక్స్‌పోర్టర్ నాలుగైదు చోట్ల మిర్చిని కొనుగోలు చేస్తారని, ఒక్కో వేమెన్‌కి 10 నుంచి 15 దుకాణాల పర్యవేక్షణ ఉంటుందని, వేమెన్ ఒక్కో షాపులో కాటాలను పరిశీలించి చిట్టీలు ఇస్తుంటారని చెప్పారు. సరుకు ట్రేడింగ్ అయినట్లు లాట్ ఐడీలు ఉన్నాయని, జీరో వ్యాపారం కాదన్న సెక్రటరీ సమాధానంతో జేసీ సంతృప్తి చెందలేదు.

పెరిగిన మిర్చి దిగుమతి

మిర్చి సీజన్ సంక్రాంతి పండగ సెలవుల తర్వాత ప్రారంభం కావడంతో దిగుమతి బాగా పెరిగింది. దాదాపుగా ఇప్పటికే రెటింపు సంఖ్యలో మిర్చి టిక్కీలను రైతులను విక్రయానికి తీసుకొస్తున్నారు. సంక్రాంతి పండగ ముందు వరకు రోజుకు 50 వేల టిక్కీల లోపే వచ్చేవి. అలాంటిది ఒక్కసారి 90 వేలకు చేరాయి. ఈ సంఖ్య రాబోయే రోజుల్లో 2 లక్షలు దాటిపోతుందని యార్డు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం యార్డులో మిర్చికి మంచి ధరనే లభిస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం యార్డులో వేరే జిల్లాల నుంచి వచ్చిన రైతులను జేసీ వాకబు చేసిన సమయంలో ఒక రైతుకు తన మిర్చికి క్వింటాల్ రూ. 13,500, మరో రైతు రూ. 15,400 ధర లభించిందని తెలిపారు. మిరపకాయలు బాగా ఆరబెట్టి తీసుకొస్తే మంచి ధరనే వస్తుందని ఈ సందర్భంగా అధికారులు జేసీకి నివేదించారు.

రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
● దావూస్ పర్యటన విజయవంతంపై హర్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఎన్డీఏ ప్రభుత్వానికే సాధ్యమని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే నాలుగు కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఏ రాష్ట్రంలో లేని విధంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు మార్గం సుగుణమైందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే సెంటిమెంట్‌కు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని, విశాఖ ఉక్కును తాకట్టుపెట్టారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రూ.11,440 కోట్లు కేంద్ర నుంచి తెచ్చి విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊరట కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణంతోపాటు పోలవరానికి నిధులు తెచ్చా రని, అభివృద్ధికి ఇదే నిదర్శమని అన్నారు. చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ దావూస్ పర్యటన విజయవంతమైందని 11.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఆంధ్రప్రదేశ్ లక్ష్మీ మిటల్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం కుదుర్చుకున్నారన్నారు. రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన మిటల్ కంపెనీకి ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రానికి పెట్టుబడులకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, త్వరలో వినుకొండలో ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులతోపాటు కొండపై రామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి మార్గం సుగమమైందని, పనుల నిర్మాణానికి ముఖ్యమంత్రి అనుమతులు ఇప్పటికే మంజూరైనట్లు చెప్పారు. పట్టణంలోని తాగునీటి పథకం నిర్మాణంతోపాటు ఎస్ఎస్‌పీ కాలనీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆంజనేయులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పీవీ సురేష్, గోవిందరాజులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు అభివృద్ధికి చంద్రబాబే కారకుడు

ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో విశాఖ ఉక్కు ఆర్థిక భరోసా లభించిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రకే కాక యావత్ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారంగా విశాఖ ఉక్కు కర్మాగారం వుందని, వేలాది మంది తెలుగువాళ్లు కలిసి వీరోచిత పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్జీవింపజేయడానికి ఎడీఈఏ ప్రభుత్వం అన్నివిధాల సహకారం అందించడం సంతోషంగా వుందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ తనపై వున్న కేసుల నుంచి విముక్తి కల్పించుకునేందుకు ఆంధ్ర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికే ఢిల్లీ పర్యటనలు చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ఏపీకి కేంద్రం గుడ్‌న్యూస్ చెబుతోందని అన్నారు.

హిమాలయ అగ్రీటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట

● గుంటూరు రూరల్ మండలంలో విస్తృతంగా తనిఖీలు
● అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనవద్దని రైతులకు సూచన



యనమదలలోని పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు , ఏఓ సుబ్రహ్మణ్యం

గుంటూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏవిధమైన అనుమతి లేకుండా బయో ఉత్పత్తులు విక్రయిస్తున్న హిమాలయ అగ్రిటెక్ కోసం వ్యవసాయ శాఖ వేట ప్రారంభించింది. మంగళవారం గుంటూరు రూరల్ మండలంలోని యనమదల, ఓబుల్ నాయుడు పాలెం, చౌడవరం, పొత్తూరు తది తర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు ,ఏఓ సుబ్ర హ్మణ్యం తనిఖీలు నిర్వహించారు.ఈ నెల 17న 'ఆగని ఆగడాలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి ఈ ప్రత్యేక తనిఖీ లు చేప ట్టారు. గ్రామాల్లోని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే బయో ఉత్పత్తులు కొనుగోలు చేయవద్దని సూచించారు. 'హిమాలయ అగ్రిటెక్' పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే అనుమతి లేని బయో ఉత్పత్తులు కొనుగోలు చేసి మోస పోవద్దని విజ్ఞప్తి చేశారు. జీ-2 అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు బయో ఉత్ప త్తుల పేరుతో రైతులకు నకిలీ మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన వార్తల నేప థ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. అటువంటి వ్యక్తులు తారసపడితే వెంటనే వ్యవసాయ శాఖ కు సమాచారం అందించాలని సూచిం చారు. ఈ సందర్భంగా యనమదలలోని పురుగుమందుల దుకాణాలను ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు తనిఖీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్ వర్సిటీ, బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ అవగాహన ఒప్పందం

గుంటూరు (విద్య)జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరులోని బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్‌అండ్‌డీ వైస్ ప్రెసిడెంట్ మురళీక్రిష్ణ మీనన్, బిజి నెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్ట్రాటజిక్ సర్వీసెస్ హెడ్ మనోగరన్‌లతో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతోపాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, సెమినార్లు, ఇండస్ట్రీ, అకాడెమియా ఇంటరాక్షన్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పరీక్షలు

విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ రావు తెలిపారు. పీజీ లో ఆర్ట్స్, సైన్స్, ఎంబీఏ, ఎంఈడి కోర్సులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

యూనివర్సిటీ బస్సు సమయాల్లో మార్పులు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఉద్యోగులను, అధ్యాపకులను వర్సి టీకి తీసుకువచ్చే బస్సుల సమయంలో మార్పులు చేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. సుబ్బారావు తెలిపారు. బస్సు సమయాలను బుధవారం నుంచి 31వ తేదీ వరకు మార్పులు చేసినట్లు తెలిపారు.

డాక్టర్ వసంతకు జాతీయ ప్రతిభా పురస్కారం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని యూనివర్సిటీ కాలేజీఆఫ్ సైన్స్ కు సంబంధించిన డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ , ఇంజ నీరింగ్ విభాగంలో బోధనా సిబ్బందిగా పని చేస్తున్న డాక్టర్ రుద్రమల్ల వసంత కు సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారం వచ్చింది. ఆమె చేసిన పరిశోధనల కృషికి గాను ఈ అవార్డు లభించింది. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో వసంతకు ఈ పురస్కారాన్ని అందజేశారు . డాక్టర్ వసంతకు ఈ గుర్తింపు రావడం కంప్యూటర్ అండ్ ఇంజనీరింగ్ రంగంలో విద్యార్థుల సాధికారత, అక డమిక్ ఎక్సలెన్స్ ప్రోత్సహించ డంలో ఆమె అంకితభావాన్ని గుర్తు చేస్తుందని వైస్ చాన్స్ లర్ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. అవార్డు గ్రహీత వసంత మాటాడుతూ ఈ గుర్తింపు విద్యార్థుల అభివృద్ధికి , విద్యా సంఘం అభివృద్ధికి మరింత దోహదపడేలా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గౌరవాన్ని తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, గురువులకు, సహచరులకు, విద్యార్థులకు, వర్సిటీ కుటుంబానికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వసంతను డాక్టర్. బీ బసవేశ్వరరావు, డాక్టర్ కే .లావణ్య, డాక్టర్ జీ నీలిమ , డాక్టర్ సూర్య కామేశ్వరి, ఎం.పుష్పలత, సిబ్బంది అభినందిం చారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

గౌడ్, గౌడ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాల కేటాయింపు

● గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 26 షాపులు ● జీవో జారీ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గౌడ్, గౌడ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 13 విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాస రావు, గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి అరుణకుమారి, పల్నాడు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మణికంఠ తదితరులు ఆయా సామాజిక వర్గాల వారీగా జనాభా ప్రకా రం మద్యం షాపులను కేటాయించనున్నారు. గుంటూరు జిల్లాలో 13 షాపులు, పల్నాడు జిల్లాలో 13 షాపులు చొప్పున మొత్తం 26 షాపులను ఆ రెండు సామాజిక వర్గాలకు కేటాయించారు. గుంటూరు జిల్లాలో గౌడ్ సామాజిక వర్గానికి 4 షాపులు, గౌడ సామాజిక వర్గానికి 9 షాపులు చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు. అదేవిధంగా, పల్నాడు జిల్లాలో కూడా గౌడ్ సామాజిక వర్గానికి 4 షాపులు, గౌడ సామాజిక వర్గానికి 9 షాపులు చొప్పున మొత్తం 13 షాపులు కేటాయించారు. త్వరలో టెండర్లు నిర్వహించి, షాపులు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.



నిందితుల వివరాలను తెలుపుతున్న సీఐ రమేష్ బాబు తదితరులు

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

తెనాలి, మారీసుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలై ముఠాగా ఏర్పడి గంజాయిని విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు చెప్పారు. సీఐ స్వాధీ నం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను చూపుతూ స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తెనాలికి చెందిన ఏడుగురు యువకులు వేముల సాయిమణికంఠ, ముత్యాల విజయ్, తమ్మిశెట్టి మదన్‌కుమార్, దనావత్ పార్థు, మూర్తి శివకుమార్, కుందాల హనుమంతరావు, ప్రేమ్‌లు చెడువ్యసనాలకు బానిసలై స్నేహితులయ్యారు. వీరు జల్సా చేసేందుకు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి విక్రయాలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అరకులో గుర్తుతెలియని వ్యక్తి నుంచి 1.6 కేజీల గంజాయిని రూ.32 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలికి తీసుకువచ్చి చిన్న, చిన్న ప్యాకెట్‌లుగా తయారుచేస్తున్నారు. వాటిని పెడదారిపట్టిన యువతకు, కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో అందరు కలిసి జల్సా చేస్తుంటారు. ఇదే క్రమంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక సుల్తానాబాదులోని సెయింట్ ఆన్ స్కూల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఏడుగురు వ్యక్తుల్లో ఇద్దరు పారిపోగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 1.1 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారుగా రూ. 22 వేలు ఉంటుందన్నారు. పరారీలో ఉన్న కుందాల హనుమంతరావు, ప్రేమ్‌ల కోసం గాలింపుచర్యలు చేపట్టామని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలు తమ ప్రాంతంలో నిషేధిత మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే 100కి లేదా 112కి గాని దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారమివ్వాలని కోరారు.

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● పల్నాడు జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం



దుర్గి,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. మంగళవారం నాలుగుపళ్ల విభాగం పోటీలో పల్నాడు జిల్లా దాచే పల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 4915 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలి చింది. బాపట్ల జిల్లా ఎద్దలపూడి మండలం అనంతవరంకు చెందిన పెదవల్లి బ్రదర్స్ ఎడ్ల జత 4750 అడుగులతో రెండో స్థానం, బాపట్ల జిల్లా జెపంగులూరుకు చెందిన చీకూరి నాగేశ్వరరావు ఎడ్లజత 4678 అడుగులతో మూడో స్థానం, గుంటూరుజిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేశం పద్మానాయుడు ఎడ్లజత 4543 అడుగులతో నాలుగోస్థానం, తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా పెదకొత్తపల్లికి చెందిన శివ ఎడ్లజత 4286 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, బండ్ల ప్రసాద్‌లు వ్యవహరించారు. కటకం రామారావు, గందె గోపాలరావు పర్య వేక్షణలో జరిగిన ఈ పోటీల్లో కూనిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యేచూరి సునీత శంకర్, తోటకూర శ్రీనివాసరావు, పులి హరి, వంక మళ్ల కోటేశ్వరరావు, శ్రీరాం కాశీబాబు, నాగెండ్ల శ్రీను, ఆకుల లక్ష్మణ, సూరె వెంకటేశ్వర్లు, దేవరకొండ కుశాలయ్య, మల్లె వెంకటేశ్వర్లు, కొండా లచ్చయ్య, మునగాకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విజేతలకు కప్ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

'భాష్యం' ప్రీమియర్ లీగ్ క్రికెట్

గుంటూరు (విద్య)జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జయాపజయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టి20 క్రికెట్ టోర్నమెంట్ - బీపీఎల్ 2024-25లో భాగంగా రెండో రోజు మంగళవారం జరిగిన ప్రిలిమినరీ మ్యాచ్‌లు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్‌లో హైదరాబాద్ హాక్స్ జట్టు - 3తో, గుంటూరు జెయింట్స్-3 తలపడగా గుంటూరు జెయింట్స్-3 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం కృష్ణా నైట్స్ జట్టుతో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

84,985 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 87,334 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 84,985 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14500
నెంబరు. 5	9500	13000
273	11500	11500
341	8000	15000
4884	9500	13500
సూపర్ 10	8000	10500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	15500
బ్యాడిగి	7300	12500
దేవనూరు డీలక్స్	7500	14300
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	13000
నెంబరు.5	7500	7500
273	--	--
341	8500	10500
4884	--	--
సూపర్ 10	8500	12000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	15000
బ్యాడిగి	7500	11500
దేవనూరు డీలక్స్	10000	12500
తెల్లకాయలు	4000	8500

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 37.34 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు.



● మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్, గుంటూరు రోడ్డు ప్రాంతంలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆయా ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ సింగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమార్కులపై చర్యలెప్పుడు ?

- గ్రామ సమైఖ్యసంఘాల్లో రూ2.4 కోట్ల అవినీతి
- విచారణలో జాప్యంపై బాధితుల ఆగ్రహం
- నోటీసుల జారీ చేయకపోవడంతో సందేహాలు
- ఉన్నతాధికారులు దృష్టిసారించాలని విన్నపం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ఆరు గ్రామాలలోని సమైఖ్య సంఘాలలో జరిగిన రూ2.4 కోట్ల అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, రైతు ఉత్పత్తిదారులకు చేయూత వంటి పథకాలలో రుణాలు పొందిన సంఘ సభ్యులు తమ రుణాన్ని తిరిగి చెల్లించినప్పటికి అవి బ్యాంకుల్లో జమ కాలేదు. దీంతో వారు పొందిన రుణాల చెల్లింపులు లేవీ రద్దు కాలేదు. దీంతో బకాయిల చెల్లించాలని బ్యాంకులు నుంచి నోటీసులు పొందిన బాధితులు బెంబేలెత్తి అధికారును ఆశ్రయించారు. దీంతో రుణాల చెల్లింపు విషయంలో జరిగిన అవినీతి బయటపడింది.

అయితే ఈ అవినీతి వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను ఆశ్రయించి సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఇంత వరకు అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై పత్రికలలో కథనాలు ప్రచురితంకాగా గతేడాది నవంబరు 24న వెలుగు పీడీ బాలునాయక్ మండల సమాఖ్యకు వచ్చి బాధిత సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం 12 మంది సభ్యులను మూడు బృందాలుగా విచారణకు ఆదేశించారు. ఇది జరిగి రెండు నెలలు అయినప్పటికీ ఇంతవరకు విచారణకు సంబంధించిన అంశాలలో ఏ పురోగతి లేదు. దీంతో విచారణను ఇలా ఎంతకాలం సాగదీస్తారంటూ బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా అవినీతిలో ఎవరి భాగస్వామ్యం ఉంది, ఎంత నగదు కాజేశారు, రికవరీ సంగతేంటి, బాధితులకు ఎలా న్యాయంచేస్తారు అన్న ప్రశ్నలకు అధికారులు ఏం సమాధానం చెబుతారంటూ నిలదీస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ విచారణలో పురోగతి లేకపోవడంతో బాధితులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి విచారణ బృందం నుంచి ఇప్పటివరకు నోటీసులు అందకపోవడం అనేది బాధితుల ఆరోపణలకు మరింత బలం చేకూర్చుతోంది.


రెండు నెలల క్రితం వెలుగు కార్యాలయంలో విచారణ జరుపుతున్న పీడీ బాలునాయక్ (ఫైల్‌ఫోటో)

రూ. 2.4 కోట్ల అవినీతిలో 25 శాతం సభ్యులు బాధ్యులైతే మిగిలిన 75 శాతం సీసీలు, యానిమేటర్లు బాధ్యత వహించాల్సి ఉంది. గ్రూపు సభ్యులు తమ ఋణాన్ని చెల్లించినట్లు రశీదులు చూపుతున్నప్పటికీ వారి సొమ్మును బ్యాంకుకు జమచేయకుండా యానిమేటర్లు, సీసీలే సొమ్మును దోచుకున్నారని బాధితులు గతంలో పీడీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలో జరిగిన అవినీతిపై సత్వర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని బాధిత సంఘాల సభ్యులు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

సత్తెనపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పని చేసే డాక్టర్లు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సూచించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం సబ్ డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది, అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు, సిబ్బందితో వివిధ అంశాల పై ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాల పిల్లల ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేసి రికార్డుల్లో నమోదు చేయలన్నారు. పిల్లలకు ఇచ్చే టీకాలు సకాలంలో అందించాలన్నారు. గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ పద్మావతి, డాక్టర్ హనుమ కుమార్, మరళీకృష్ణ, నీలకంఠేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

పెదకూరపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరులో రూ 40 లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్న నలను పొందుతుందన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు మక్కెన సాగర్, మండల టీడీపీ నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ, షేక్ అజ్మల్లా, సిర్రా సుబ్బారెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, కళ్ళం సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేత టీంకి షీల్డ్ అందజేత

మాచవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సీకే నాయుడు టోర్నీ 2025 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన టీమ్‌కు మంగళవారం షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గోరంట్ల నాగేశ్వరరావు, చప్పిడి రాము, కటికల బాల కృష్ణ, శెట్టి హనుమంతురావు, కర్నా సైదా రావు, లింగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

సత్తెనపల్లి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న నక్కా కోటిరెడ్డి(60) నరసరావుపేటలోని ఆయన స్వగృహంలో సోమవారం రాత్రి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ ఏ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం నరస రావుపేట వెళ్ళి కోటిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కొష్టంలో ఎడ్లు మాయం

వెల్దుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొష్టంలో కట్టేసిన ఎడ్లు మాయమైన ఘటన మండలంలోని మండాదిలో జరిగింది. గ్రామానికి చెందిన పులి వెంకటరెడ్డి తన రెండు ఎడ్లను సోమవారం సాయంత్రం తన కొష్టంలో కట్టివేశాడు. మంగళవారం ఉదయం కొష్టానికి వెళ్లి చూడగా ఎద్దులు కనిపించ లేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని భావించిన వెంకటరెడ్డి వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎడ్ల విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధితుడు వెంకటరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

రెంటచింతల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ నిధులతో చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని డ్వామా పీడీ ఎస్ లింగమూర్తి ఆదేశించారు. మంగళవారం మండలంలోని దశ బంధు కాలువ మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ కోరటా మల్లి కార్జునరావు, ఎంపీడీవో కె సరోజినిదేవి, ఏపీవో జయచంద్ర, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కూటమి పాలనతోనే సంక్షేమం

క్రోసూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం సంక్షేమం ముఖ్యంగా పాడి పరిశ్రమ అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. మంగళవారం క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లో జరిగిన పశు వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు.

పాఠశాలే ప్రజా ప్రతినిధిని చేసింది


ఎమ్మెల్యే యరపతినేనిని సన్మానిస్తున్న ఫాదర్ పీటర్ పాపయ్య, పూర్వ విద్యార్థులు

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని
- సెయింట్ జోసఫ్ పాఠశాల రజతోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించిన యాజమాన్యం

రెంటచింతల, జనవరి21 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో తాను చదవుకున్న రోజుల్లో అప్పటి ఉపాధ్యాయుల బోధన, వారునేర్పిన క్రమశిక్షణ తనను ఎంతో ప్రయోజకుడిని చేసిందని, ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగేలా చేసిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య ఆధ్వర్యంలో పలువురు పూర్వవిద్యార్థులు మంగళవారం గుంటూరు వెళ్లి ఎమ్మెల్యే యరపతినేని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న పాఠశాల రజతోత్సవ (75 సంవత్సరాలు) కార్యక్రమానికి యరపతినేనిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లు లేని రోజుల్లో అంటే 1949లోనే ఈ పాఠశాలను స్థాపించి వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత యాజమాన్యానికి దక్కుతుందన్నారు. తాను ఆ పాఠశాలలో 1975 నుంచి 1980 వరకు ఐదేళ్లపాటు చదువుకున్నానన్నారు. పాఠశాల ఉన్నతికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీనిచ్చారు. కార్యక్ర మంలో పూర్వ విద్యార్థులైన తుమ్మా లూర్దురెడ్డి కొమ్మారెడ్డి మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

సత్తెనపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరింప చేయటానికి ఎన్‌డీఏ ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయిన విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇది కూటమి ప్రభుత్వ విజయమేనని కన్నా తెలిపారు.

ఓర్వలేనితనంతోనే విమర్శలు

సత్తెనపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ మంత్రి అంబటి రాంబాబు తప్పుడు విమర్శలు చేస్తు న్నారని, ఇకపై మానుకోక పోతే తాట తీస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధికి అంబటి చేసిదేమీ లేదన్నారు. చంద్రబాబు, లోకేశ్, కన్నాలను విమర్శించే నైతికత ఆయనకు లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ఆళ్ళ సాంబయ్య, ఆళ్ళ అమరేశ్వరరావు, పెద్దిరాజు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వెంకటకోటయ్య, నూర్‌బాషా జాన్‌బాబు, జానీ ఖాజా వలి, ఆశీర్వాదం, స్టాలిన్, శంకరరావు, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లపై విచారణ

సత్తెనపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో దివ్యాంగుల పింఛన్ రూ 15 వేలు పొందుతున్న లబ్ధిదారులను మునిసిపల్ కమిషనర్ షమ్మి పర్యవేక్షణలో వైద్యుల బృందం మంగళవారం విచారించింది. ఈక్రమంలో 8మంది లబ్ధిదారుల ఇళ్లకువెళ్లి అంగవైకల్య నిర్ధారణ పత్రాలను పరిశీలించారు.

నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి -1, 2 సచివాలయాల పరిధిలోని 21 మంది దివ్యాంగుల పింఛన్‌లను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మండల పరిషత్ అధికారులు తనిఖీలు చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో కారంపూడి మండలం ప్రథమం

- అభినందించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదులో కారంపూడి మండలం ప్రథమంగా నిలిచింది. ఈ మేరకు శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు, అభిమానులకు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో 72వేల పైచీలుకు టీడీపీ సభ్యత్వాలునమోదయ్యాయని, కారంపూడి మండలంలో 14,37 సభ్యత్వాలు నమోదైనట్లు తెలిపారు. అత్యధికంగా కారంపూడి పట్టణంలో 3026, ఒప్పిచర్లలో 2300 సభ్యత్వాలు నమోదైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా రామకృష్ణ

కారంపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల సొసైటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నాగారపు రామకృష్ణ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా చినకొదమగుండ్లకు చెందిన వెన్నా హనిమిరెడ్డి, లక్ష్మీపురంకు చెందిన ఉన్నం రామయ్యలు నియమితులయ్యారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా వీరు నియామక ఉత్తర్వులు అందుకోనున్నారు. తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు వీరికి అభినందనలు తెలిపారు.

పెన్షనర్లకు సత్కారం

పిడుగురాళ్ళ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పిడుగురాళ్ల పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో పలువురు పెన్షనర్స్‌ను సన్మానించారు. 75 సంవత్సరాలు నిండిన, 83 సంవత్సరాలు నిండిన పెన్షనర్స్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు తుల్లిబిల్లి శేషగిరిరావు, పల్నాడు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేవీ చలపతిరావు, కోశాధికారి మహంకాళి డేవిడ్‌లు ఘనంగా సత్కరించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు కొత్త రఘురామయ్య, యేలూరి సైదారావు, సంఘ గౌరవ అధ్యక్షుడు చల్లగుండ్ల విశ్వనాథం, ఎం కోటేశ్వరరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణప్రియ

నర్సరీల్లో డీఎఫ్‌వో తనిఖీ

అచ్చంపేట,జనవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లగరిగ బీటు పరిధిలోని తాడువాయి వద్ద ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం డీఎఫ్‌వో కృష్ణ ప్రియ తనిఖీ చేశారు. రికార్డులను, షీల్డ్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ నర్సరీల వద్ద తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. తాడువాయి వద్ద నర్సరీలో నెమలినార, వేప, నేరేడు, గానుగ మొక్కలను పెంచుతున్నామన్నారు. కార్యక్రమంలో రేంజర్ వెంకట రమణ, బీఆర్‌వో కుసుమ కుమారి, బీట్ అధికారి వర ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు

దాచేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి పట్టణ పరిధిలోని దుర్గా సిమెంట్ ఫ్యాక్టరీలో మంగళవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషకుమార్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. రిజిస్ట్రేషన్ సహా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. భద్రతా పతాకాన్ని ఆవిష్కరించారు. సభకు ప్లాంట్ హెడ్ సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ సంజయ్ కుమార్ సింగ్, వేణు, తారక్, గణేష్, రామకృష్ణ, శంకర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

అచ్చంపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చంపేట, చామర్రు, తాళ్ళచెరువు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి పీ వెంకటేశ్వర్లు తెలిపారు. పొలాలలో మిరప, మొక్క జొన్న పైర్లను పరిశీలించామని, తుగుళ్ల నివారణపై రైతులకు సలహాలు,సూచనలు అందజేశామన్నారు. కార్యక్రమంలో కిషోర్‌రెడ్డి, విజయారెడ్డి, సిబ్బంది అనిత, మాన్యా నాయక్, రహీం, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగవరం గ్రామ పరిధిలో మిర్చి పైర్లను ఉద్యాన అధికారి దాసరి నవీన్ పరిశీలించారు. తెగుళ్ళ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆయన రైతులకు వివరించారు. ఆయనతో పాటు గ్రామస్థాయి ఉద్యాన సహాయకులు, రైతులు ఉన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రామమ్మ ఆయా గ్రామాల్లోని కంది, మిరప, వరి, పొగాకు, మొక్కజొన్న పైర్లను పరిశీలిచారు.

లైంగిక దాడిపై మహిళ ఫిర్యాదు

మాచవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు, ఎస్‌ఐపేర్కొన్న సమాచారం ప్రకారం.. మాచ వరం గ్రామానికి చెందిన ఒక మహిళ అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో కలిసి స్నేహం ఉండేది. ఇటీవల ఆ మహిళకు వివాహం కుదిరింది. దీంతో గతంలో తనతో స్నేహంగా ఉండే వ్యక్తితో కలిసి దిగిన ఫోటోలు ఇవ్వాలంటూ ఆమహిళ ఆవ్యక్తిని అడిగింది. ఈక్రమంలో ఫోటోలు ఇస్తానంటూ నల్లగొండ జిల్లా దేవరకొండ వద్దకు తీసుకు వచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సహకరించిన మరో మహిళ పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైతులను వలస కూలీలుగా మార్చారు

- తహసీల్దారుతో సమావేశంలో మైహోం సిమెంట్ ఫ్యాక్టరీకి భూములిచ్చిన రైతుల ఆవేదన
- ఫ్యాక్టరీని నిర్మించి ఉపాధి కల్పించాలని వినతి

దాచేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : 'భూములు ఇస్తే ఫ్యాక్టరీలు నిర్మిస్తాం, మీ పిల్లలకు ఉద్యోగాలు ఇస్తాం, మీ గ్రామాలను తీర్చిదిద్దుతాం అంటూ మా నుంచి వందల ఎకరాలు కొనుగోలు చేసి 20 ఏళ్ల కావస్తున్నా ఇంత వరకు ఫ్యాక్టరీ నిర్మించలేదని, అలాంటిది ఉపాధి ఎలా చూపుతారు?' అంటూ మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీకి భూములు ఇచ్చిన రైతులు ఆగ్రహం వెళ్ళ గక్కారు. మంగళవారం దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామ సచివాలయం వద్ద బాధిత రైతులు సమావేశమయ్యారు. సమావేశానికి తహసీల్దార్ వైవీ కుటుంబరావు, ఎస్ఐ సౌందర్ రాజన్, ఇతర ప్రజా సంఘాల నాయకులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు అధికారులతో మాట్లాడుతూ తాము ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకం కాదని, కానీ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకుండా, ఉపాధి చూపకుండా తమను వలస కూలీలుగా మార్చిన ఫ్యాక్టరీ యాజమన్య చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టక పోవటంతో తమ భూములు బీళ్లుగా మారాయని. పంటలు పండించి పది మందికి పట్టెడు అన్నం పెట్టే తాము నేడు కూటి కోసం వలస కూలీలుగా మారామని, ఇతర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల వద్ద వాచ్‌మెన్‌లుగా వెళ్ళి జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీకి తామిచ్చిన భూములు చాలవన్నట్లు రాళ్ళ గుట్టలు, వాగు పోరంబోకులు, డొంకలు, కుంటలను ఆక్రమించి హద్దురాళ్ళు పాతారని, దీంతో మేకలు, జీవాలు, గేదెలకు మేత లేకుండా పోయిందని ఆరోపిం చారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీనిర్మాణాన్ని చేపట్టాలని, తమకు ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ వైవీ కుటుంబారావు మాట్లాడుతూ రైతులు వెల్లడించిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని, తనవంతుగా సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామి ఇచ్చారు. సమావేశంలో పోలె సుధీర్, కోలా నవజ్యోతి, కోలా రమణారెడ్డి, రోళ్ళ కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మాతంగి సత్యానందం, మేదర డానియేలు తదితరులు తమ ఇబ్బందులను వివరించారు.

ఎంఈవోలకు అదనపు భారం

- ఒక్కొక్కరికి రెండేసి మండలాల చొప్పున బాధ్యతల కేటాయింపు ..

పిడుగురాళ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండల విద్యాశాఖాధికారులపై అదనపు భారం పడింది. ఒక్కొక్క విద్యాశాఖాధికారికి ఒక్కో మండలం అదనంగా వుండటం, ఇప్పుడు మరో మండలాన్ని అదనంగా చేర్చడంపై విద్యాశాఖ అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. రాజుపాలెం విద్యాశాఖాధికారి-1గా పనిచేస్తున్న బీ. మల్లికార్జునశర్మకు దాచేపల్లి ఎంఈవో-1గా, వినుకొండ ఎంఈవో-1గా చేస్తున్న సయ్యద్ జఫ్రుల్లాకు మాచర్ల ఎంఈవో-1గా, సత్తెనపల్లి ఎంఈవో-1గా చేస్తున్న ఏ.శ్రీనివాసరావును గురజాల ఎంఈవో-1గా, పిల్లుట్ల జీవీజీకే హైస్కూల్ హెచ్‌ఎంగా వున్న ఎ. శ్రీనివాసరెడ్డికి వెల్దుర్తి ఎంఈవో-1గా, మాచర్ల ఎంఈవో-2గా పనిచేస్తున్న ఎ సురేష్‌కు వెల్దుర్తి ఎంఈవో-2గా, క్రోసూరు ఎంఈవో-2గా పనిచేస్తున్న ఎన్ గణేష్‌కు అచ్చంపేట ఎంఈవో-2గా అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే పిల్లుట్ల జీవీజీకే హైస్కూల్ హెచ్‌ఎంగా వున్న శ్రీనివాసరెడ్డి పిడుగురాళ్ళ, కారంపూడి మండలాలకు ఎంఈవో-1గా పనిచేస్తుండగా ఇప్పుడు కొత్తగా వెల్దుర్తి మండలం కేటాయించారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి 143వ ఆరాధనోత్సవం

- హాజరు కానున్న ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు

మాచర్లటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలోని ధర్మవరంలో బుధవారం చిరుమామిళ్ల సుబ్రహ్మణ్యస్వామి 143వ ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, తెలంగాణ ఎమ్మెల్సీ ప్రజాకవి గోరేటి వెంకన్న, సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడిలు విచ్చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి స్వామి వారి ఆరాధన, మధ్యాహ్నం అన్నదానం, భజనలు, నామ సంకీర్తన, సాయంత్రం ఊరేగింపు, రాత్రి 7 గంటలకు కోలాట ప్రదర్శన, 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు

క్రోసూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి తెలిపారు. నాలుగు కంపెనీల ప్రతినిధులు 46 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలు ఎంపికైనవారి వార్షిక వేతనం గరిష్ఠంగా రూ.3.5 లక్షలు ఉంటుందని, నియామక పత్రాలను వారి మెయిల్‌కి పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డేవిడ్ రాజు, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధి వైపీ శ్రీనివాష్, హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై 122 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 46 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకుమారి, నైపుణ్యాభివృద్ధికి తమ్మాజీరావు, ఉద్యోగ కల్పన అధికారి రవీంద్రనాయక్, మాచర్ల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కిరణ్‌నాయక్, సీడాప్‌జాబ్స్ కోఆర్డినేటర్ నానినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశు వైద్యశిబిరాలు

ముప్పాళ్ళ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంకెలకూరపాడులో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా లేగ దూడల ప్రదర్శన చేపట్టారు. దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులను, మినరల్ మిక్చర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం శ్రీనివాసరావు, పశు వైద్యులు డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ పీ రామారావు, స్థానిక పశు వైద్యులు డాక్టర్ ఎం పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం గ్రామంలో పశువైద్యులు ఏడీ డాక్టర్ వీరయ్య పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి బాలకృష్ణారెడ్డి, విశ్రాంత పశు వైద్యులు మరియదాసు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నకరికల్లు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలమర్రి గ్రామంలో నిర్వహించిన పశు వైద్యశిబిరంలో గేదెలు, దూడలకు, గొర్రెలు, మేకలకు నట్టల మందును వేశారు. 59 గేదెలకు గర్భకోశ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో దేచవరం పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్ సుజాత, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాలలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 14 ఆవులు, 48 గేదెలకు గర్భకోశ వైద్య పరీక్షలు, అనారోగ్యం పాలైన 62 పశువులకు చికిత్స చేయడంతోపాటు 600 జీవాలకు నట్టల మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి బషీర్ తెలిపారు.

మాచర్లటౌన్,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1,2వార్డుల్లో నిర్వహించిన పశువైద్య శిబిరంలో వైద్యశాల సిబ్బంది శ్రీధర్‌బాబు పశువులకు గొంతు వాపు వ్యాధి టీకాలు, చూడు పరీక్షలు జరిపి నట్టల నివారణ ట్యాబెట్లు పంపిణీ చేశారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో పశువైద్యాధికారి సాల్మన్‌సింగ్ ఆధ్వర్యాన ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్ర మంలో సర్పంచ్ శివరామ్, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం, కొత్తూరు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నాను విమర్శించే అర్హత అంబటికి లేదు

రాజుపాలెం,జనవరి21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను విమర్శించే అర్హత అంబటి రాంబాబుకు లేదని మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, సాగర్ కెనాల్ కమిటి మాజీ డైరెక్టర్ అంకాళ్ల ప్రభుదాసు అన్నారు. మంగళవారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబటి ఎమ్మెల్యేగా కొనసాగిన ఐదెళ్లలో నియోజకవర్గంలో అరాచకత్వం రాజ్యమేలిందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కన్నా అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కన్నాను విమర్శిస్తే తగిన గుణపాఠం చేబుతామని హెచ్చరించారు.


● మా పాపకు ఫోన్ అలవాటైపోయింది. ఫోన్ తీసుకుంటే ఏడుస్తోంది. గంటల తరబడి ఫోన్లో బొమ్మలు చూస్తూ గడిపేస్తోంది. ప్రవర్తనలో కూడా మార్పు కనిపిస్తోంది. పిలిచినా పలకడం లేదు. పట్టించుకోవడం లేదు. ఆడుకోవడానికి వెళ్లడం లేదు. పెద్దవాళ్లు ఎత్తుకుంటున్నా దగ్గరకి రావడం లేదు. ఫోన్ లేకుండా తిండి తినడం లేదు. ఎప్పుడూ.. ఫోనే.. మాన్పించలేక పోతున్నాం. ఏం చేయాలి? ఒక చిన్న పిల్లల మానసిక వైద్యుడి దగ్గర ఒక తల్లి ఆవేదన! చిన్నప్పుడు ఏడుపు మాన్పించడానికి చేసిన ఆ పనితో పాప పూర్తిగా ఫోనుకు బానిసై పోయింది.

● మా పాప సెల్‌ఫోన్ వాడుతున్నప్పటి నుంచి మా మాట వినడం తగ్గించింది. మొండిగా సమాధానమిస్తోంది. ఎవరితో ఫోన్‌లో మాట్లాడుతున్నావంటే చెప్పదు. గంటల కొద్దీ ఫోన్‌లోనే గడిపేస్తున్నది. మేమెప్పుడైనా ఊరెళ్తే ఇంట్లో ఒక్కతే ఉండాల్సి వస్తుందని మాతోనే వచ్చేది. ఇప్పుడు మేము ఎప్పుడు ఊరెళ్తామా అని ఎదురుచూస్తున్నట్టుగా ఆమె మాటలు ఉంటాయి. మా అమ్మాయికి ఎవరైనా ప్రేమికుడు ఉన్నారా? లేక ఆ వయసులో ఇలాంటి ప్రవర్తన సహజమేనా? రాత్రుల్లో కూడా సెల్‌ఫోన్ వినియోగిస్తుంటుంది. అసలు మా అమ్మాయి మొబైల్ నుంచి దూరం కావాలంటే ఏం చేయాలి?' సైకియాట్రిస్టు వద్ద ఓ తల్లి ఆవేదన - ఇలా చెప్పుకుంటూ పోతే సెల్‌ఫోన్, ప్రత్యేకించి స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల సమస్యలతో మానసిక వైద్యశాలలో నిండిపోతూ ఉన్నాయి. ఇబ్బడి ముబ్బడి మొబైల్ వినియోగం సమాజాన్నే ప్రమాదంలోకి నెడుతోంది.

● మా అబ్బాయికి మొబైల్ అలవాటైపోయింది. అది అపుదామంటే వాడు మాపైనే చేతులెత్తుతున్నాడు. ఇంట్లో ఉన్న వస్తువులను విసిరేస్తున్నాడు. రాత్రి 2, 3 అయినా మేల్కొనే మొబైల్‌లో ఏవో వీడియోలు చూస్తుంటాడు. ఓ రోజు వాడి ఫోన్ చెక్ చేస్తే అందులో అసభ్యకరమైన వీడియోలు ఉన్నాయి. వాడిని ఎలా మంచి ప్రవర్తనలోకి తీసుకురావాలి? అంటూ ఒక తండ్రి సైకియాట్రిస్ట్‌ను ఆశ్రయించాడు.

● ఒకప్పుడు యువతపైనే ప్రభావం.. నేడు అన్ని వయసులవారూ...

● తగ్గించుకోకుంటే ప్రమాదమే అంటున్న నిపుణులు



మొబైల్ బానిసత్వం!

● ప్రతి ఒక్కరినీ ముంచేస్తున్న స్మార్ట్ ఫోన్లు

గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మనిషి గుప్పెట్లో ఇమిడిపోయే చిన్న ఫోన్.. నేడు మనిషిని, ఏకంగా మొత్తం మానవ సమాజాన్నే తన గుప్పెట్లోకి తీసుకుంది. మనిషికి మనిషికి మధ్య సంబంధాలను, అనుబంధాలను తుంచేస్తోంది. చుట్టూ అందరూ ఉన్నా.. తనదైన మైకంతో ఒంటిరిని చేసేస్తోంది. ఆధునిక ప్రపంచపు అద్భుత ఆవిష్కరణగా ముందుకు వచ్చిన మొబైల్, ఇప్పుడు మహమ్మారిలా మనిషిని వెంటాడుతోంది. తాను చెప్పినట్లల్లా ఆడేలా బానిసను చేసుకుంటోంది.



● యువతపై 'నీలి' నీడ!

యువత భవిష్యత్తును నీలి నీడ నాశనం చేస్తోంది. స్మార్ట్‌ఫోన్ల నుంచి వచ్చే నీలి కాంతులు ఒకవైపు.. అసభ్యకర వీడియోలు మరోవైపు వారి ఆలోచనలను మానసికంగా, శారీరకంగా భ్రష్టు పట్టిస్తున్నాయి. 17- 24 ఏళ్ల మధ్య ఉన్న వారు 44 శాతం మంది, 25-34 మధ్య ఉన్న వారు 41 శాతం మంది అశ్లీల వీడియోలు చూస్తున్నట్టు ఓ సర్వే రిపోర్టు వెల్లడించింది. పరిస్థితిని అవగతం చేసుకోవడానికి ఈ గణాంకాలు సరిపోతాయి. గతంలో మార్కులు, ర్యాంకులు సాధించలేమని ఒత్తిడికి గురయ్యే యువత ఇప్పుడు క్షణకాలం ఫోన్లు ఆగినా, పెద్దలు ఆపేసినా గందరగోళానికి గురవుతున్నట్లు మానసిక నిపుణులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ వాడొద్దని షరతులు విధిస్తే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనకాడటం లేదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటేనే పిల్లల్లో మార్పు తీసుకురాగలమని సైకాలజిస్టులు సూచించారు. చిన్నారులు, యువకులే కాకుండా పెద్దవారిని సైతం మొబైల్ ఫోన్ వీడడం లేదు. ఆధ్యాత్మిక కార్యక్రమాలో, భక్తి పాటలో ఏవో ఒకటి మొబైల్‌లో చూసుకుంటూ వారూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెబుతున్నారు.

ఫోన్లు పిల్లల ప్రాణాలకు శాపాలు

ఆర్. పవిత్ర కన్సల్టెంట్ సైక్రియాటిస్ట్, పల్నాడు జిల్లా




రెండేళ్లలోపు పిల్లలకు ఫోన్ అనేదే ఇవ్వకూడదు. రెండేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అర్ధగంట కంటే తక్కువ సమయం ఇవ్వాలి. సాధ్యమైనంత వరకూ తల్లిదండ్రులు, నాన్నమ్మ, తాతయ్యలు దగ్గరకు తీసుకోవాలి. వారితో ఎక్కువ సమయం గడపాలి. వారికి కబుర్లు, కథలు చెప్పాలి. దగ్గరుండి వారిని మిగిలిన పిల్లలతో కలిసి ఆడుకునేలా చేయాలి. ఫోన్ వాడే సమయంలో పేరెంటల్ కంట్రోల్ తప్పనిసరిగా ఉండాలి.

తీవ్ర మానసిక సమస్యలు..

వీ వెంకట కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఎక్కువ సేపు ఫోన్ చూడడం ద్వారా మెదడులో డొపమైన్ విపరీతంగా ఉత్పత్తి అవుతుం ది. దాన్ని వినియోగించుకోలేక పోతే అది అస్తవ్యస్తంగా మారుతుంది. ఆ కారణంగా మానసిక సమస్యలు వస్తాయి. ప్రధానంగా నిద్రలేమి, ఏకాగ్రత కొరవడడం, క్షణికావేశం, విచక్షణ కోల్పోవడం, ఆత్మహత్య ఆలోచనలు, ఏడీహెచ్‌డీ, ఆటిజం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆ కారణంగా కొద్ది సేపు ఫోనుకు దూరమైనా చచ్చిపోవాలనే స్థితికి వచ్చేస్తారు. ప్రస్తుతం చిన్నారులు మొదలు, పెద్దవారి వరకూ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. మొబైల్ నుంచి క్రమ పద్ధతిలో దూరమవ్వకపోతే అనర్థాలు తప్పవు.



● ఎలా బయటపడాలి?

మొబైల్ మేనియా నుంచి బయటపడాలంటే స్వీయ నియంత్రణ అనేది చాలా ముఖ్యం. ఎవరైనా అశ్లీల వీడియోలకు అడిక్ట్ అయి ఉంటే వారు మొదటగా ఆ విషయాన్ని తమలో తాము ఒప్పుకోవాలి. తమలో వచ్చిన మార్పులను గ్రహించాలి. రోజులో వారు ఎంత సమయం ఎటువంటి యాక్టివిటీస్‌కు వినియోగిస్తున్నామో పేపర్‌పై రాసుకోవాలి. మనం చేయాల్సిన పనిని రద్దు చేసుకుని మరీ సెల్‌ఫోన్‌లోనే గడిపేస్తున్నామా? అనేది ఆలోచించాలి. ఇటువంటి ప్రవర్తనతో వచ్చే ప్రతికూల పరిస్థితులను బేరీజు వేసుకోవాలి. ఈ సమయంలో అడిక్షన్ నుంచి బయటపడడానికి మార్గాలు వెతుక్కోవాలి. చాలా వరకు ఒత్తిడితో ఉండే వాళ్లు, ఖాళీ సమయం ఎక్కువగా ఉన్నవాళ్లు ఆ సమయంలో ఇటువంటి విషయాల బారినపడుతుంటారు. ఎందుకంటే అన్నింటిలో కన్నా సెక్స్ అనేది చాలా సంతోషకరమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో మొబైల్ డేటా తగ్గించుకోవడం, అశ్లీల యాక్టివిటీ సదుపాయాలను రద్దు చేసుకోవడం చేయాలి. ఇది నెమ్మదిగా జరిగే ప్రక్రియ. ఖాళీ సమయాల్లో తమకు నచ్చిన ఇతర అభిరుచులు సంగీతం, డ్యాన్స్, ఇతరాత్ర పనులపై ఆలోచనలు సాగేలా దృష్టి కేంద్రీకరించాలి. ఇంకా కుదరని పక్షంలో సైకాలజిస్టును సంప్రదిస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.



అనుమతిస్తే.. అమ్ముకుంటాం

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వం అన్నదాతలకు చుక్కలు చూపించడం ఒక ఎత్తయితే నగదు జమ విషయంలో నెలల తరబడి ఎదురుచూడలేక దళారులనే ఎక్కువగా ఆశ్రయించారు. దీనికి తోడు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర కూడా కొంతమేర ఆశాజనకంగా ఉండడం ఇవన్నీ కూడా గత రెండేళ్లలో సేకరణ అంతంతమాత్రంగా జరిగింది. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విషయాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుంది. ఈ మేరకు చర్యలు చేపడుతుండడంతో సహజంగానే కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం పరిమాణం పెరిగింది. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం, తేమశాతంతో పాటు ఇతర నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలనే ప్రభుత్వ సూచనలు అమలు జరగడం వంటివన్నీ కూడా ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల బాట పట్టడానికి కారణమైంది.

అంచనా వేయడంలో విఫలం..

ధాన్యం సేకరణ లక్ష్యం విషయంలో ప్రభుత్వం సరైన అంచనా వేయలేకపోయింది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలోనే దాదాపు 5 లక్షల టన్నుల దాకా దిగుబడి ఉంటోంది. ఈ జిల్లాలో అతి స్వల్పంగా లక్ష్యం 50,000 కే పరిమితం చేసింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ నెలకొంది. బాపట్ల జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 50,000 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించగా, దాదాపు రెండు లక్షల టన్నుల వరకు ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు క్షేత్రస్థాయి గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇంకో లక్షన్నర టన్నుల వరకు గోడౌన్‌లతో పాటు మిల్లుల్లో అన్నదాతలు నిల్వ చేసుకున్నారు. చాలా వరకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పెట్టుబడి కోసం స్థానికంగా ఉండే వ్యాపారులను ఆశ్రయించడంతో, ఇప్పుడు ధాన్యాన్ని కూడా వారికే అమ్మకుని నిలువునా మోసానికి గురవుతున్నారు.

ధర మరింత పతనమయ్యే అవకాశం..

ఇన్ని రోజులూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం సేకరిస్తూ ఉండడంతో బహిరంగ మార్కెట్‌లో ధర రూ.1550కి అటూఇటూ ఉంటూ వస్తోంది. కానీ ఇప్పుడు లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు నిలిచిపోయాయి. ఇదే అదనుగా ధరను మరింత పతనమైంది. దళారులంతా సిండికేట్ అయి అన్నదాతలను వంచించే కుట్రకు తెరలేపారు. ఇప్పటికే క్వింటా ధాన్యం ధర రూ.1400కు తగ్గించి దళారులు అడుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం వెంటనే అదనంగా ధాన్యం సేకరణకు అనుమతులిస్తే అటు రైతులకు మేలు జరగడంతో పాటు బయట మార్కెట్‌లో ధాన్యం ధర మరింత పతనమవకుండా కాపాడినట్లవుతోంది. ఈ పరిస్థితుల్లో వెంటనే మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరో వైపు గతంలో వర్షాల సమయంలో ఉన్న ధాన్యాన్ని ముందుగా మిల్లులకు తరలించాలని ప్రభుత్వం సూచించింది. చాలా మంది రైతులు తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని మిల్లులకు తరలించి నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం లక్ష్యం పూర్తి కావడంతో ఆ ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు వెనకడుగు వేస్తున్నారు. కొనని కాడికి ఎందుకు నిల్వ చేసుకోనిచ్చారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 10,000 టన్నుల ధాన్యం మిల్లుల్లో ఈ ధాన్యం నిల్వ చేసి ఉన్నారు. ఈ ధాన్యం విషయంలో ప్రస్తుతం తకరారు నడుస్తోంది.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని శ్రీ హజరత్ కాలేమస్తాన్‌షా అవులియా(మస్తానయ్యదర్గా) 133వ ఉరుసు మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత ఐదు రోజులుగా బాబా వారికి దీపారాధన, చాందిని అలంకరణ, శేషవస్త్రాల పంపిణీ, గంధం సమర్పణ, భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు మహోత్సవాల్లో భాగంగా బాబా సమాధిని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి దర్శించుకుని చద్దరును, గంధాన్ని సమర్పించారు. అనంతరం కన్నావారితోటలోని బాబా వారి ఆశీనులైన కుర్చీని యథా స్థానంలో ఉంచారు. దీంతో ఉరుసు ఉత్సవాలు ముగిశాయని దర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.



ఫకీర్ల నుంచి ఆశీస్సులు పొందుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

కన్నావారితోటలోని యథాస్థానంలోకి బాబా కుర్చీ



మస్తాన్‌బాబా సమాధిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

రక్తహీనతను అధిగమించాలంటే పౌష్టికాహారం

ఆరోగ్యంగా ఉండాలంటే సరైన తిండి, సరిపడా నిద్ర చాలా ముఖ్యం. ఈ రెండు విషయాలను నిర్లక్ష్యం చేస్తే, వాటి ప్రభావం వారి భవిష్యత్తు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కౌమార దశలోని బాలికలు, గర్భిణులు రక్తహీనత సమస్య బారినపడ కుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు పాటించక తప్పదు. పౌష్టికాహారం, నిద్ర చక్కగా ఉండాలని, ఈ రెండింటిపై ఎంత శ్రద్ధ పెడితే అంత ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

- కౌమార దశలోని బాలికల్లో, గర్భిణుల్లో అనారోగ్య సమస్యలు
- ఆకలిని చంపేస్తున్న జంక్‌ఫుడ్
- సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ నిద్రకు దూరం
- తగినంత తిండీనిద్ర తప్పనిసరంటున్న వైద్యులు

సత్తెనపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో బాలికలు, ఇంటర్ విద్యార్థినులు ఆరోగ్య సమస్యలతో ముఖ్యంగా విపరీతమైన కడుపునొప్పి, రుతుచక్రం సరిగా జరగక పోవడం, రక్తహీనత వంటి సమస్యలతో సతమతమవుతుంటారు. చాలామంది గర్భిణులు కూడా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇందుకు ముఖ్యకారణం పౌష్టికాహార లోపం. సమయానికి ఆహారం తీసుకోవాలని, తగినన్ని గంటలు నిద్ర పోని పక్షంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలకు రక్తహీనతతో ఉన్న బాలి కల కేసులు, గర్భిణుల కేసులు వస్తున్నాయి. కేవలం, ఏరియా వైద్యశాలకు కాకుండానే పలు ప్రైవేట్ వైద్యశాలలకు కూడా ఈ తరహా కేసులు వస్తున్నాయి. రక్తహీనతను తట్టుకుని ముందుకు వెళ్లాలంటే పౌష్టికాహారం కీలకం అనే విషయాన్ని విస్మరిస్తున్నారు. పాఠశాల, కళాశాల విద్య కోసం దూర ప్రాంతానికి వెళ్లే బాలికలు, గ్రామాల్లో పొలం పనులకు వెళ్లే గర్భిణులు పౌష్టికాహారంవిషయంలో ఏమా త్రం శ్రద్ధపెట్టడం లేదు. చిరు తిండ్లు, జంక్‌ఫుడ్ కేకులు, పానీపూరీ, నూడిల్స్ వంటివి ముఖ్యంగా బాలి కలు తీసుకుంటు న్నారు. ఇవి తిన్నాక ఆకలి చచ్చిపోతుంది. దీంతో, రాత్రి భోజనం మానేస్తున్నారు. ఇదే పొరపాటు కొన్ని నెలల పాటు చేస్తే అలవాటు గా మారి అది అనారోగ్యానికి దారితీస్తుంది. ఆ ప్రభావం కొందరి పై పెళ్ళికి ముందు, ఇంకొందరికి పెళ్ళి అయిన తరువాత కన్పిస్తుంది.

ఆహారంతో పాటు నిద్ర విషయంలోనూ ఇదే తప్పు చేస్తు న్నారు. టీవీలు, సెల్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ సమయానికి నిద్ర పోవడం లేదు. చాలా మంది పిల్లలు మామూలు సమ యం కన్నా స్క్రీన్ సమయం ఎక్కువ నమోదవ్వడం భవిష్యత్ ప్రమాదాన్ని హెచ్చరిస్తుంది. ప్రతి ఒక్కరు కనీసం ఏడు గంటలు నిద్రపోతేనే ఆరోగ్యమని వైద్యులు చెబుతున్నారు. సెల్ ఫోన్‌లు, టీవీలకు, సోషల్‌మీడియాకు అతుక్కుపోవడం వల్ల అనేక మందికి కళ్ళ సమస్యలు తలెత్తుతు న్నాయి. ప్రాథమికదశలో సమస్యను ఎదుర్కొన్న వాళ్లలో కొద్దోగొప్పో జాగ్రత్తపడుతున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

డాక్టర్ జీ అరుణ, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి



కౌమార దశలో ఉన్న ఆడపిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. ముఖ్యంగా వారు తీసుకొనే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానికి పౌష్టికా హారం అందించాలి. శారీరక శ్రమ వారిలో లోపిస్తుంది. ఇంటికి వచ్చిన తరువాత ఇంటి పనులు, వంట పనుల్లో సహ కారం అందించేలా బాలికలను వారి తల్లులు ప్రోత్సహించాలి. అప్పుడే వారు శారీరకశ్రమతో ఆరోగ్యంగా ఉంటారు. చదువే ముఖ్యం కాదు. ఆరోగ్యం అంతకన్నా ముఖ్యం. రక్తహీనత, రుతుక్రమం వంటి సమస్యలతో కొంత మంది విద్యార్థినులు వైద్యశాలకు వస్తున్నారు. వారికి మందుల చీటి రాయడం అంటే కాస్త బాధగానే ఉంటుంది. ఫాస్ట్, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని గర్భిణులు

గర్భిణుల్లో 40 మందికి రక్తహీనత

డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రతి నెలా 120 నుంచి 130 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. వీరిలో 40 మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుండటం గుర్తించాం. అవసరమైన వారికి రక్తం ఎక్కించి కాన్పులు చేస్తున్నాం. యుక్త వయస్సులోని విద్యార్థినిలు కూడా రక్త హీన తతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తున్నారు. వారికి ఐరన్ మాత్రలు అందించడంతో పాటు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియ జేస్తున్నాం.

తుదిపోరుకు ప్రీమియర్ లీగ్ పోటీలు

రేపు ఫైనల్స్... బహుమతుల ప్రదానం

మంగళగిరి సిటీ(నవులూరు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి మండలం నవులూరు అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం నెల్లూరు-కడప, గుంటూరు-విజయనగరం జట్లు తలపడనున్నాయి. 23న ఉదయం ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేస్తారు. ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లును ఇప్పటికే పూర్తి చేశారు.

ప్రీమియర్ లీగ్‌కు అపూర్వ స్పందన

ఇప్పటివరకు మంగళగిరి నియోజకవర్గానికే పరిమితమైన ఎంపీఎల్ పోటీలు ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జట్లను ఆహ్వానించారు. పోటీలను సైతం అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో నిర్వహించడంతో ప్రేక్షకులు, క్రీడాభిమానుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ నెల 12 నుంచి జరుగుతున్న పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 13 జట్లతోపాటు మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు కూడా పాల్గొంది. రోజుకు రెండు మ్యాచ్‌ల చొప్పున జరిగాయి. అభివృద్ధి, సంక్షేమంతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని భావించిన మంత్రి నారా లోకేశ్ మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట సొంత నిధులతో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా లోకేశ్ కృషి చేస్తున్నారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో క్రీడా మైదానాలను కూడా ఏర్పాటు చేశారు. త్వరలో ప్రభుత్వ సహకారంతో మంగళగిరిలో అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. పోటీల్లో ప్రతి క్రీడాకారుడికి అన్ని సదుపాయాలతోపాటు దుస్తులను మంత్రి లోకేశ్ అందజేస్తున్నారు. దాతల సహకారంతో ప్రైజ్ మనీ, ట్రోఫీలు కూడా ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో మంగళగిరి నుంచి పాల్గొనే క్రీడాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు కేంద్రం ప్యాకేజీ: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పునరుజ్జీవానికి, కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదల, కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం ప్రత్తిపాటి మాట్లాడుతూ జగన్ కేసుల మాఫీకోసం విశాఖ ఉక్కుని అమ్మకానికి పెడితే, చంద్రబాబు రాష్ట్రానికే మణిహారమైన ప్లాంట్‌ను కాపాడేందుకు అహర్నిశలు శ్రమించారన్నారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని, కేంద్ర మంత్రులకు విశాఖ ఉక్కును ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తులు ఫలించాయని వివరించారు. రాష్ట్ర గౌరవాన్ని, హక్కులను చంద్రబాబు కాపాడుతున్నారన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఘనంగా శ్రీపుష్పయాగం

చిలకలూరిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షరాఫ్ బజార్‌లోని కోదండరామస్వామి దేవాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం స్వామివార్లకు 27 నక్షత్రాల, 26 రకాల పూలతో శ్రీపుష్పయాగం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్తిపాటికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సోలార్ ప్యానల్ డ్రైవ్ చోరీ

గణపవరం (నాదెండ్ల), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో సోమవారం అర్ధరాత్రి సోలార్ డ్రైవ్ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొర్నగంటి మస్తాన్‌రావుకు చెందిన పొలంలోని సోలార్ ప్యానల్ బోర్డులోని డ్రైవ్ చోరీకి గురైంది. ఈ డ్రైవ్ విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మస్తాన్‌రావు పేర్కొన్నాడు. సోలార్‌ను బిగించుకొని జామ పంటను ఆయన సాగు చేస్తున్నాడు. గతంలో కూడా ఆయన పొలంలో సోలార్ విద్యుత్‌కు సంబంధించి కొన్ని వస్తువులు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దివంగత పారిశ్రామికవేత్త సాదినేని చౌదరయ్య సతీమణి తులశమ్మ 8వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీవిద్యామిత్ర మండలి ఆధ్వర్యంలో వారి కుమార్తె పంగులూరి ధనలక్ష్మి పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కడి వృద్ధులకు హాట్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనలక్ష్మితో పాటు శ్రీవిద్యామిత్ర మండలి అధ్యక్షురాలు మర్రి లలిత, పంగులూరి సుబ్బారావు, సాదినేని పద్మ, బాపూజీ వృద్ధాశ్రమం అధ్యక్ష కార్యదర్శులు ఆరాధ్యుల రామకృష్ణ, మురికిపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరు మృతి

యడ్లపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో చోటుచేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోపూరి శేషయ్య (40) మంగళవారం ఉదయం సమీపంలోని చెరువు గట్టు వద్దకు బహిర్భూమికి అని వెళ్లాడు. కొడుకు రెండు గంటలైనా ఇంటికి రాకపోవడంతో తండ్రి శేఖర్ చెరువు గట్టుపై వెతగ్గా నీటిలో తేలియాడుతున్న కుమారుడిని చుట్టుపక్కల వారి సాయంతో బయటకు తీశారు.

రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

చిలకలూరిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం ఇక్కడ జరిగింది. సమావేశంలో రాష్ట్ర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దేవుళ్ళ మురళి, ప్రధాన కార్యదర్శిగా కుంచం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా వేముల రాము, కార్యదర్శులుగా అంజనేయులు, మన్నెల మునిస్వామి, దేవుళ్ల ఏడుకొండలు, అలుగుల లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా బత్తుల విజయకుమార్, యువజన సంఘం అధ్యక్షుడిగా పల్లపు శివయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలిగా వేముల పార్వతి, ఉపాధ్యక్షుడిగా మల్లెం అంజమ్మ ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ వడ్డెరలను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించాలని, వడ్డెరలకు క్వారీలలో 30శాతం వాటాను డిపాజిట్ లేకుండా కేటాయించి, రూ.25లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

హోంగార్డులకు ఘన సన్మానం

నరసరావుపేట లీగల్, జనవరి 21: పల్నాడు జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డ్‌లను జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు. బాపట్ల జిల్లాలో సేవలందిస్తూ గత ఏడాది ఉద్యోగ విరమణ చేసిన కే సుమతిని, కమ్యూనికేషన్ ఆఫీస్‌లో సేవలందించి జె చిన్నను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి చెరో ఐదు లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. బీసాంబమ్మ ఫింగర్ ప్రింట్ బ్యూరోలో సేవలందిస్తూ గత ఏడాది ఆగస్టు 14న ఉద్యోగ విరమణ చేసి అనంతరం మృతి చెందారు. ఆమె కుమార్తె భూలక్ష్మికి రూ.5 లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ కృష్ణ కమ్యూనికేషన్ సీఐ తదితరులు పాల్గొన్నారు.

బైట్ ఎక్స్‌ఎల్‌తో ఈశ్వర్ కళాశాల ఒప్పందం

నరసరావుపేట టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ కోసం బైట్ ఎక్స్‌ఎల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో బైట్ ఎక్స్‌ఎల్ కో-ఫౌండర్ తాడేపల్లి చరణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ముజీర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీమ్ మొహిద్దీన్, కళాశాల ఎండీ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నజీమా పాల్గొన్నారు.

‘పేట’ సమస్యలపై ప్రత్తిపాటి సమీక్ష

● అక్రమ లే అవుట్లపై ఆగ్రహం



గుంతల పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో అక్రమ లే అవుట్లు ఎవరువేసినా పార్టీలకు అతీతంగా వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అన్నారు. అనుమతులు లేని లేఅవుట్ల తొలగింపుపై అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని, అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కఠినచర్యలకు ఉపక్రమించాలని ఆయన అధికారులకు సూచించారు. మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ అంశాలపై ఆయన అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బందితో కౌన్సిల్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఆయన మున్సిపల్ స్థలాలు ఆక్రమించిన వారిపై కూడా కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ తాగునీటి కుళాయి కనెక్షన్లను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. తాగునీరు, మురుగు కాల్వలు, వీధి దీపాల సమస్యలు పరిష్కారం కాకుంటే తన దృష్టికి తేవాలని ఆయన కౌన్సిలర్లను కోరారు. పట్టణంలోని పార్కులలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు గైకొనాలని అన్నారు. గత ఐదేళ్ల అధికారం వెలగబెట్టిన వైసీపీ ప్రభుత్వం ప్రజల గురించి, వారి సమస్యలు పట్టించుకోకుండా అవినీతి, అక్రమార్జన పైనే దృష్టిపెట్టిందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే రోడ్లపై గుంతలు పూడ్చేపనులు ప్రారంభమయ్యాయని, పట్టణంలో రోడ్లపై ఎక్కడా గుంతలు ఉండటానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశానికి ముందు ఆయన పట్టణంలోని పలు ప్రాంతాలలో పర్యటించి జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. కొన్నిచోట్ల పనులు నిదానంగా సాగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు, డీఈ రహీం, టీపీవో సుజాత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సరైన శిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



అధికారులకు జ్ఞాపికలందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, జనవరి 21: (ఆంధ్రజ్యోతి): సరైన డ్రైవింగ్ శిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా ‘రోడ్డు ప్రమాదాలు వాటి నివారణకు’ అనే అంశంపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో జరిగింది. రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కే దుర్గ పద్మజ సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కలిగించారు. జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా రోడ్డుసేఫ్టీ ఎన్‌జీవో సంస్థ ఇక్కడచేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో ఆర్‌కే దుర్గాపద్మజ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా మాసంలో దేశవ్యాప్తంగా ‘సడక్ సురక్ష జీవన్ రక్ష’ నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

విశాఖ ఉక్కు అభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర మణిహారం విశాఖ ఉక్కు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మివేసి డబ్బులు చేసుకుందామని భావించారన్నారు. కూటమి నాయకుల పోరాటంతో విశాఖ ఉక్కును కాపాడుకోవడం జరిగిందన్నారు. నరసరావుపేట నియోజకవర్గానికి రూ.4కోట్ల నిధులు వచ్చాయన్నారు. మహాశివరాత్రికి కొత్తపల్లి నుంచి కోటప్పకొండ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. నరసరావుపేట సింధు స్కూల్ సమీపంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి రూ.40లక్షలు, మార్కెట్ దగ్గర ఓవర్‌హెడ్ ట్యాంక్, పంపుహౌస్, పైప్‌లైన్ కోసం రూ.36లక్షలు, చిత్రాలయ వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఎం.కబ్బిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మన్నాన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో 22 మంది వైసీపీ సానుభూతిపరులకు రిమాండ్

సబ్‌జైలు వద్ద ఉద్రిక్తత

వినుకొండ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ సానుభూతిపరులు ఓ కుటుంబంపై దాడిచేసి, ద్విచక్ర వాహనంను దహనం చేసిన కేసులో నిందితులకు వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మంగళవారం రిమాండ్ విధించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2022వ సంవత్సరం పట్టణంలోని పాతబస్తీలో జిమ్‌జాని కుటుంబంపై వైసీపీకి చెందిన కొందరు సానుభూతి పరులు దాడిచేసి ఇంట్లో ఉన్న విలువైన సామగ్రితోపాటు ఇంటిముందు ఉన్న బైక్‌ను దహనం చేశారు. ఈ కేసులో 24మంది వైసీపీ సానుభూతిపరులు, అదే పార్టీకి చెందిన జిమ్‌జానీ కుటుంబంపై దాడిచేసి జానీని తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనపై జానీ గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి అధికార పార్టీ అండదండతో దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో ఇటీవల జానీ గత ప్రభుత్వ హయాంలో తన కుటుంబంపై జరిగిన దాడిపై న్యాయం చేయాలంటూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మొత్తం 24మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. కేసులో ఉన్న ఇద్దరు సోమవారం బెయిల్ పొందారు. ఈ నేపథ్యంలో కేసులోని మిగిలిన సభ్యులు కోర్టులో లొంగిపోయి బెయిల్‌కోసం ప్రయత్నం చేశారు. దీంతో కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి 22మందికి 14రోజులుపాటు రిమాండ్ విధించారు. సాయంత్రం వరకు బెయిల్ వస్తుందని ఎదురు చూసిన వైసీపీ సానుభూతిపరులకు నిరాశ ఎదురైంది. ఈ సందర్భంగా వారిని పోలీసులు జైలుకు తరలిస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రిమాండ్ విధించిన వారిలో వైసీపీ పార్టీకి చెందిన పల్నాడు జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ ఉన్నట్లు సమాచారంతో వైసీపీ సానుభూతిపరులు, ఇతర నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు ఒక్కసారి సబ్‌జైలు వద్దకు చేరుకోవటంతో అక్కడ కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

జాతీయ నాణ్యత హాస్పిటల్‌గా

డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలకు గుర్తింపు

నరసరావుపేట లీగల్, జనవరి 21: పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాల జాతీయ నాణ్యత హాస్పిటల్‌గా గుర్తింపు పొందినట్లు వైద్యశాల ఏవో పరిటాల సత్యనారాయణ మంగళవారం తెలిపారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రోగులకు క్లినికల్, నాన్ క్లినికల్, డయాగ్నస్టిక్ తదితర విభాగ నిర్వహణలో నాణ్యతను గుర్తించి నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ధ్రువీకరణ పత్రాన్ని ప్రదానం చేసినట్లు తెలిపారు. సదరు ధ్రువీకరణ పత్రాన్ని ఆయన వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేషనల్ లెవెల్‌లో క్వాలిటీ సర్టిఫికెట్ రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పల్నాడు ప్రాంత ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ అన్నిరకాల ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందించినందుకు గాను తమకు ఈ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. తమ వైద్యశాలలో అందిస్తున్న వైద్య సేవలను గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లా ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

ఉద్యోగాల భర్తీలో మోదీ ప్రభుత్వం విఫలం

● ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

వినుకొండ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిపోయిందని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ అధ్యక్షతన ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా భారీ బహిరంగ సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా శివయ్య స్తూపం సెంటర్‌లో ఏఐవైఎఫ్ జెండాను ఈశ్వరయ్య ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ మూసివేస్తూ ప్రైవేటీకరణ చేస్తున్న మోదీ ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు మాట్లాడుతూ లౌకిక రాజ్యాంగం ద్వారానే బలహీనవర్గాలకు ఉపయోగం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన శ్రీకాకుళంలో 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సీపీఐ నియోజకవర్గ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, తాళ్ళూరి బాబూరావు, శ్రీనివాస రెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బారావు, చిలకలూరిపేట కార్యదర్శి మల్లికార్జున, పట్టణ కార్యదర్శి రాంబాబు, వినుకొండ ఏఐవైఎఫ్ కార్యదర్శి అజయ్, గురజాల నియోజకవర్గం ఏఐవైఎఫ్ కార్యదర్శి పత్తిపాటి నాగరాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలి: ఏవో

వినుకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి తెలిపారు. మండలంలోని బ్రహ్మణపల్లి, జాలలపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మిరప, పొగాకు పంటలను సందర్శించి చీడపీడ నివారణ పై సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, ఉద్యానవన శాఖ అధికారి రసూల్, ఇన్‌చార్జి మండల ఏవో వరలక్ష్మి, ఏఈవో సునీత, వీహెచ్‌ఏ సాయిరాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మేలైన యాజమాన్య పద్ధతులు తెలియ జేస్తూ పరిశోధన ఫలితాలను రైతులకు చేరువ చేస్తున్నామని, జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా చింతలచెరువు, మృత్యుంజాపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, రైతులతో కలసి కంది, వరి, మిరప పైర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ బీ రవి బాబు, ఏవో సుగుణా బేగం, ఏఈవో ఎలిషా, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపి, అపర్ణ పాల్గొన్నారు.

శావల్యాపురంలో సామాజిక తనిఖీలు

శావల్యాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్పీ జేఎస్ఆర్ రాజు తెలిపారు. శావల్యాపురం జడ్పీ పాఠశాల్లో సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం మంగళవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీ బృందం సభ్యులు జేఎస్ఆర్ రాజు, గంగాధర్‌రావు, సాగర్‌లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్ళు దగ్ధం

● రూ 18 లక్షల మేర ఆస్తి నష్టం ● ఒక గేదె మృతి.. నాలుగు గేదెలకు గాయాలు

ఈపూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనికుంటలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్ళు దగ్ధం కాగా ఒక గేదె మృతి చెందింది. మరో నాలుగు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బచ్చనబోయిన నర్సమ్మ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో నర్సమ్మ ఇంటితో పాటు పక్కనే ఉన్న షేక్ నన్నేషా పూరిల్లు కూడా అగ్నికి ఆహుతైంది. నర్సమ్మ ఇంటి పక్కన గడ్డి వాము దగ్ధం కాగా అక్కడే కట్టేసిన గేదెలకు మంటలు వ్యాపించి ఒకటి మృతచెందగా, నాలుగు గేదెలకు తీవ్రంగా గాయాలయ్యాయి. సుమారు రూ.18 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగింది. నర్సమ్మ ధాన్యం అమ్మగా వచ్చిన రూ.2లక్షల నగదు, 10సవర్ల బంగారు నగలు, విలువైన పత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న ఈపూరు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి మంటలార్పే ప్రయత్నం చేశాడు. వినుకొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదం వలన నర్సమ్మ, నన్నేషా కుటుంబాలు సర్వసం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. బాధితులకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఒంటేరు శ్రీనివాసరావు బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

రీ - సర్వే పనులను క్షుణ్ణంగా పరిశీలించాలి: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె

నరసరావుపేట రూరల్, జనవరి 21: (ఆంధ్రజ్యోతి): రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పల్నాడు జిల్లాలో నిర్వహిస్తున్న రీ-సర్వేపై జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్న అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మురళి, నరసరావుపేట ఆర్డీవో మధులత, సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, ఏడీ సర్వేయర్ భానుకీర్తి, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు మండల కో ఆర్డినేటర్‌లు, రెవెన్యూ సూపరింటెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

శావల్యాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధులను నివారించి సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందింపజేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని పశువైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, సోమల గుణధీర్‌లు అన్నారు. మండలంలోని కృష్ణాపురం, వయ్యకల్లు గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. కృష్ణాపురంలో 64పశువులకు, వయ్యకల్లులో 56పశువులకు గర్భకోశవ్యాధి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది సుందరయ్య, కుంద్రకాంక్షయ్య, యానిమల్ హజ్‌బెండరీ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు..

● రొంపిచర్ల: వైద్య శిబిరాలను పశు రైతులు వినియోగించు కోవాలని మాజీ ఎంపీపీ జెల్లిపల్లి శేషమ్మ తెలిపారు. పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని విప్పర్ల, గోగులపాడు గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. గోగులపాడు పశు వైద్య శిబిరాన్ని జంతు వ్యాధి నిర్ధారణ ల్యాబ్ డిప్యూటీ కార్యాలయం నుంచి వచ్చిన సహాయ సంచాలకులు సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఈపూరు: మండలంలోని బోడెపూడివారిపాలెంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 115 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పశువైద్యాధికారి వీ గోపాల్‌నాయక్, కొండ్రముట్ల పశు వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని రైతు సేవా కేంద్రాల క్లస్టర్ పరిధిలో పశు వైద్య శిబిరాలను నిర్వహించటం జరుగుతుందని డాక్టర్ జీ కవిత మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా పశు అసిస్టెంట్ డైరెక్టర్ పీ శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. కార్యక్రమంలో పెంటాల వెంకటేశ్వర్లు, బేతపూడి వెంకటేశ్వర్లు, పల్నాటి వెంకటేశ్వర్లు, అర్దలపూడి శ్రీనివాసరావు, షేక్ సుభానీ, కందుల కోటేశ్వరరావు, గంగనబోయిన ఆంజనేయులు, ఈర్ల దిబ్బయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పల్నాడు రోడ్డులోని శివాలయం సెంటర్‌లో చేపడుతున్న మరమ్మతులు

తాగు నీటి పైపులైన్ లీకులు పూడ్చివేత

నరసరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులను మునిసిపాల్టీ మంగళవారం చేపట్టింది. తాగునీరు వృథా అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి మునిపల్ అధికారులు స్పందించారు. రావిపాడు రోడ్డులో వివిధ ప్రాంతాల్లో ప్రధాన పైపులైన్ ఏర్పడిన లీకులను పూడ్చివేశారు. ఆరు లీకులను పూడ్చివేసి నీటి వృథాను అరికట్టారు. ఈ పనులను డీఈ రఫీ పర్యవేక్షించారు. మరమ్మతులను పురస్కరించుకొని నిలిపివేసిన తాగునీటి సరఫరాను బుధవారం పునరుద్ధరించనున్నారు.

బస్ షెల్టర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన



బస్ షెల్టర్ స్థలాన్ని పరిశీలించి కమిషనర్‌కు సూచనలు చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు బస్ షెల్టర్లను నిర్మించనున్నట్లు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా బస్ షెల్టర్ నిర్మించనున్న ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌తో కలిసి మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా నరసరావుపేటరోడ్డు, మార్కాపురంరోడ్డు, కారంపూడి రోడ్డులోని స్థలాలను పరిశీలించి ఫౌండేషన్ నిధులతో రెండు, మూడు నెలల్లో షెల్టర్లు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సురేష్ మహల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పత్తి పూర్ణ, పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్సపాలెం బైపాస్‌కు మరమ్మతులు నిర్వహించాలి

● పీడీఎం నాయకుల డిమాండ్



ఇస్సపాలెం బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కర్నూలు హైవే నుంచి ఇస్సపాలెం బైపాస్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఇస్సపాలెం బైపాస్ రోడ్డును పీడీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీఎం నాయకులు మాట్లాడుతూ గుంటూరు రోడ్డు నుంచి ఇస్సపాలెం వైపు భారీ వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు నిత్యం తిరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ప్రజా సంఘాల వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తామని చెప్పడమే కాని మరమ్మతులు నేటివరకు చేయలేదన్నారు. కొత్తరోడ్లు ఒకవైపు ప్రభుత్వం వేస్తామంటూ ప్రకటిస్తున్నారని, ఉన్నరోడ్లు రిపేరు మాత్రం చేయడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతిలోపు రాష్ట్రంలో ఉన్న రోడ్ల రిపేర్లు పూర్తి చేస్తామని ప్రకటించారని, ఆ హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిరప, మొక్కజొన్నలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● డీడీఏ శివకుమారి

శావల్యాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మిరప, మొక్కజొన్న పంటల్లో తెగుళ్ళ నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన అధిక దిగుబడులను సాధించవచ్చని డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. మండలంలోని వేల్పూరు, కొత్తలూరు గ్రామాల్లో రైతులు సాగుచేసిన మిరప, మొక్కజొన్న పంటలను మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావుతో కలసి ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాలలో రైతులకు తెగుళ్ళ నివారణపై అవగాహన కల్పించారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ మిరప పంటలో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఫిప్రోనిల్ మందును ఎకరాకు 400ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంఏవో రామారావు మాట్లాడుతూ రబీలో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ ఈ కేవైసీ, బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ పెండింగ్ ఉన్న రైతులు వెంటనే పూర్తిచేయాలని, లేదా పోస్టల్ అకౌంట్ ఐనా తీసుకోవాలన్నారు. ఏఈవో పూరేటి అశోక, వీఏఏలు అనూష, శ్రీనివాసరావు, హరిబాబు పాల్గొన్నారు.



దాతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూరు పాఠశాలకు పూర్వ విద్యార్థుల తోడ్పాటు

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వివేకానంద పూర్వవిద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో 1999-2004 మధ్య చదువుకున్న పూర్వవిద్యార్థులు సంక్రాంతి రోజున ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి పాఠశాల ఆవరణను బాగు చేసేందుకు రూ.30వేలు, రూ.30వేలు విలువజేసే టేబుళ్ళు కుర్చీలు, ప్లాస్టిక్ కుర్చీలను మంగళవారం హెచ్‌ఎం మహబూబ్ సుభానీకి అందజేసినట్లు తెలిపారు. పాఠశాలకు సహకరించిన పూర్వ విద్యార్థులు తూమాటి చెన్నయ్య, సాదినేని హరిబాబు, దన్నవరపు బ్రహ్మం, కొప్పురావూరి వీరాంజనేయులు, పొదిలి సతీష్, నాదెండ్ల చంద్రశేఖర్‌లను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దన్నవరపు శ్రీనివాసరావు, హెచ్‌ఎం సుభానీ, గ్రామపెద్దలు బొల్లా పేరయ్య, చలపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు శ్యామలా దండకం గ్రంథావిష్కరణ

నరసరావుపేట కల్చరల్, జనవరి, 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శృంగేరి శంకరమఠంలో గురువారం ఉదయం పది గంటలకు కాళిదాస కృత శ్యామలా దండకం - సుదర్శన వ్యాఖ్య గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని సాహితీ అభిమానులు, ఆధ్యాత్మికవేత్తలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.